## క్లుప్తంగా

### నాడు-నేడు పనుల పరిశీలన



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈవో రామచంద్రరావు

**డుంబ్రిగుడ:** ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఈవో రామచంద్రరావు అన్నారు. మండలంలోని గుమ్మగుడ ఎంపీపీ పాఠశాలను ఆయన సోమవారం పరిశీలించారు. నాడు-నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఉండేలా చూడాలన్నారు. పాఠశాల ప్రారంభానికి ముందు నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అలాగే పాఠశాల విద్యా కమిటీతో కలిసి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

### తాగునీటి సమస్యపై వినతి



ఏవో రమణమూర్తికి వినతిపత్రాన్ని అందజేస్తున్న మహిళలు

**మారేడుమిల్లి:** మండల కేంద్రంలోని చెలకవీధి గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. మూడు రోజులు నుంచి తమ వీధికి తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏవో రమణమూర్తికి అందజేశారు.

**ముంచంగిపుట్టు:** మండలంలోని బంగారు మెట్ట పంచాయతీ మాలగుమ్మి గ్రామంలో తాగునీటి పథకం పాడవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకుడు పవన్ తదితరులు కోరారు.

### వీఓఏల నిరసన



నిరసన తెలుపుతున వెలుగు వీఓఏలు

**అరకులోయ రూరల్:** మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం వద్ద వీఓఏలు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వీఓఏల మండల సంఘం నాయకులు రాజ్‌కుమార్, చిన్ని మాట్లాడుతూ వీఓఏలకు కాలపరిమిత సర్క్యులర్ రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. వంశీ, గంగ, రత్నమణి, జమున తదితరులు పాల్గొన్నారు.

### దుస్తుల పంపిణీ



రావణబందలో గిరిజనులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వేణు

**జి.మాడుగుల:** మండలంలో గదుతూరు పంచాయతీ రావణబంద గ్రామంలో జయశాలి ఎడ్యుకేషనల్ ట్రస్టు, ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ఏఎస్సార్ జిల్లా ఉమెన్స్ కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. రావణబంద పరిసర గ్రామాలకు చెందిన 100 మందికి దుస్తులు అందజేశారు. విశాఖపట్నం సీబీటీ ప్రిన్సిపాల్ వేణు, పాడేరు, అరకు ప్రిన్సిపాళ్లు పి.అశ్విన్, చిన్ని, కమిటీ సభ్యులు పి.రాజమ్మ, సీహెచ్.స రోజ, ఎస్.ఉషా తదితరులు పాల్గొన్నారు.

### పిడుగుపాటుకు విద్యుత్ పరికరాలు ధ్వంసం



దూసరపాములోని ఓ ఇంట్లో దెబ్బతిన్న ఇన్వెర్టర్ బ్యాటరీ, సామగ్రి

**రాజవొమ్మంగి:** మండలంలోని దూసరపాము గ్రామంలో సోమవారం సాయంకాలం ఓ విద్యుత్ స్తంభంపై పిడుగు పడి స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. పిడుగు ధాటికి కొందరి ఇళ్లల్లో ఎల్రక్టానిక్ వస్తువులు కాలిపోయాయి. కసిరెడ్డి రమణ ఇంటికి సమీపంలో పిడుగు పడింది. దీంతో వీధిలైట్ ధ్వంసమై పడిపోయింది. అతడి ఇంట్లో ఇన్వెర్టర్ దెబ్బతింది. ఫ్రిడ్జ్, టీవీ కాలిపోయాయి. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి హాని జరుగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు.



# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- గానుగుల, రామరాజుపాలెం గ్రామాల్లో గడప గడపకు
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి ఘన స్వాగతం



గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

**కొయ్యూరు:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగుతోందని, అర్హులందరికీ పథకాలను అందిస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. నడింపాలెం సచివాలయం పరిధిలోని గానుగుల, రామరాజుపాలెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమెకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఆయాగ్రామాల్లో 175 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు పారదర్శకంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని జగనన్న అమలుచేశారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలన అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వైఎస్సార్ భరోసా, రాయితీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వలంటీర్ల ద్వారా పింఛన్లు ఇతరత్రా పథకాలు ప్రజల చెంతకే అందుతున్నాయన్నారు. ఎంపీపీ రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, వైస్ ఎంపీపీలు వెంటరమణ, నూకాలు, మండల కన్వీనర్ బండి సుధాకర్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, సర్పంచ్ ముసిలినాయుడు, ట్రైకార్ డైరెక్టర్ సరస్వతి, నాయకులు సత్యనారాయణ, దోని బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

## వేతనదారుల సమస్యల పరిష్కారానికి కృషి



డి.చింతలవీధిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం తదితరులు

**హుకుంపేట:** మండలంలోని దాలిగుమ్మడి, డి.చింతల వీధి గ్రామాల్లో ఉపాధి హామీ పనులను జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండ తీవ్రతకు జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేయాలని సూచించారు. వేతనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతమందికి సక్రమంగా కూలి అందడం లేదని పలువురు సమస్యను తెలియజేశారు. దీనిపై ఆయన స్పందించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశానుసారం 100రోజుల పని దినాలు పూర్తి చేసుకోవాలన్నారు. ఉపాధి ఏపీవో, ఎంపీడీవోలతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, నాయకులు అనిల్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన

**రాజవొమ్మంగి:** మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మంగళవారం పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి మండలంలోని చెరకుంపాలెం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.ఎమ్మెల్యే ధనలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధుల నేతృత్వంలో చెరకుంపాలెంలో జరుగనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అధికారులు, సచివాలయ సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

## రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ హనుమంతరావు

**జి.మాడుగుల:** ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు తెలిపారు. మండలంలో సొలభం పంచాయతీ ఎస్.కొత్తూరు గ్రామంలో ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన రీసర్వేపై గ్రామసభ కార్యక్రమం సోమవారం సర్పంచ్ హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కరించటానికి రీ సర్వే కార్యక్రమం నిర్వహిస్తోందని, ప్రజలందరు సహకరించాలని ఆయన కోరారు. వీఆర్వో కె.సుబ్బారావు, నాయకులు జి.చిరంజీవినాయుడు, గ్రామ వలింటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సోమాలమ్మ జాతర ప్రారంభం



ప్రత్యేకాలంకరణలో సోమాలమ్మ అమ్మవారు

**అడ్డతీగల:** అడ్డతీగల ఇలవేల్పు అయిన సోమాలమ్మ జాతర మహోత్సవాలు సోమవారం రాత్రి నుంచి వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి.అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నూతన వస్త్రాలతో అలంకరించిన అమ్మవారి చెంతన ఉన్న గరగల ఊరేగింపు నాట్యాలు, చిత్ర విచిత్ర వేషదారణలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల నడుమ సాగింది. అడ్డతీగల శివారున సీతారామరాజు కాలనీకి వెళ్లారు. అక్కడికి అప్పటికే వచ్చిన ఊయల రాటలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చి ఊయలను ఏర్పాటుచేశారు. జాతరలో కోలాటం ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతర ఆద్యంతం మందుగుండు సామాగ్రి, డప్పు వాయిద్యాలతో సందడి నెలకొంది.

## మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తేజస్విని

**అరకులోయ రూరల్:** మానసిక రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారించామని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.తేజస్విని చెప్పారు. మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిని ఆమె సోమవారం సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మానసిక రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు జిల్లా పరిధిలో పీహెచ్‌సీ, సీహెచ్‌సిలలో మానసిక రోగులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చి మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలను గ్రామస్థాయిలో ప్రజలకు చైతన్యం కల్పించాలన్నారు. మానసిక ఆరోగ్య నోడల్ అధికారి రమేష్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## భూసర్వేతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం

- మేడిచర్ల గ్రామసభలో తహసీల్దారు రమేష్‌బాబు



మేడిచర్ల గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు

**కె.కోటపాడు:** పారదర్శకంగా నిర్వహించే జగనన్న శాశ్వత భూహక్కు–భూసర్వే కార్యక్రమానికి రైతులంతా సహకరించాలని తహసీల్దార్ జె.రమేష్ బాబు తెలిపారు. భూసర్వే కార్యక్రమంపై సోమవారం మేడిచర్ల గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో 1,600 ఎకరాలకు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే బృందాలకు రైతులు భూములను చూపించడంతోపాటు ఆధార్, పాస్‌పోర్టు ఫొటో, పాస్‌బుక్ జెరాక్స్, బ్యాంక్ ఖాతాల నంబర్లు ఇవ్వాలని సూచించారు. భూసర్వేతో భావితరాలకు ఎటువంటి రెవెన్యూ సంబంధిత ఇబ్బందులు ఉండవని తెలిపారు. మండలంలో మొదటి విడతలో ఏడు గ్రామాల్లోను, రెండో విడత 16 గ్రామాల్లోను సర్వేచేయగా, మూడో విడతలో మిగిలిన గ్రామాల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వీఆర్వో జగదీష్, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిరెడ్డి వెంకటరావు, రైవాడ ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు పాల్గొన్నారు.

## నేడు నాతవరంలో కోటమ్మతల్లి పండగ



**నాతవరం:** కోరిక కోర్కెలు తీర్చే కల్పవల్లి కోటమ్మతల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. స్థానిక కోటమ్మతల్లి పండగను గ్రామస్తులు మూడేళ్లకోసారి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గ్రామంలో భారీ విద్యుద్దీపాలంకరణతో ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ డి. లక్ష్మీనారాయణ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

## ఎంఎస్‌ఆర్ నేషనల్ డిగ్రీకళాశాలలో నేడు జాబ్‌మేళా

**మునగపాక :** స్థానిక ఎంఎస్‌ఆర్ నేషనల్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 10గంటలకు ఐసీఐసీఐ ఆధ్వర్యంలో జాబ్‌మేలా జరుగుతుదని నిర్వాహకులు తెలిపారు. బీఎస్సీ,బీకాం,బీఏ తదితర చదువులు పూర్తి చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఏడాదికి రూ.2.6 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ప్యాకేజీ ఉంటుందన్నారు. 25 సంవత్సరాల లోపు వయస్సున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీ, తెలంగాణలో ఉద్యోగ సదుపాయం ఉంటుందన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ కోరారు. మరిన్ని వివరాలకు 9989282524, 9182020936 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## పిడుగుపాటుకు పశువుల పాక దగ్ధం



పిడుగుపాటుకు కాలిపోయిన పశువుల పాక

**మాడుగుల రూరల్:** పిడుగుపాటుకు పశువులు పాక దగ్ధమైంది. మండలంలో వీరవల్లి అగ్రహారంలో శానాపతి రమణకు చెందిన పశువుల పాక ఆదివారం రాత్రి దగ్ధమైంది. పిడుగు పడేటప్పుడు పశువులు లేకపోవడం వల్ల ప్రమాదం తప్పింది. జి. అగ్రహారం రహదారిలో సుంకర వారి కళ్లాల వద్ద జరిగిన ఈ ప్రమాదంలో వ్యవసాయ పనిముట్లు, యూరియా బస్తా కాలిపోయాయని బాధిత రైతు వాపోయాడు. స్థానికుల సమాచారం మేరకు మాడుగుల అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.30 వేల ఆస్తి నష్టం వాటిల్లింది.

## వైభవంగా గూడెపమ్మ జాతర



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

**ఎస్.రాయవరం:** పెట్టుగోళ్లపల్లి గ్రామంలో గూడెపమ్మతల్లి జాతర మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు.గ్రామస్తులు అమ్మవారిని ప్రతిష్టించిన రోజున ప్రతి ఏడాది ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈమేరకు అమ్మవారిని గ్రామస్తులు దర్శించుకుని పసుపుకుంకుమలు, చీర సారెలు సమర్పించారు.

## సీఆర్‌పీఎఫ్ సేవలు



పేదలకు భోజనం ప్యాకెట్లు ఇస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

**వై.రామవరం:** సివిక్ యాక్షన్ ప్రోగ్రాం లో భాగంగా వై.రామవరంలో సోమవారం సిఆర్‌పిఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు భోజనం పేకట్లు పంపిణీ చేశారు. ఒకపక్క వారపు సంత, మరోపక్క ప్రభుత్వ కార్యాలయాల పనులపై వచ్చిన సుమారు 200 మందికి భోజనం ప్యాకెట్లను అందజేశారు. ఈకార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంటు నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.

## పంపిణీకి పాఠ్య పుస్తకాలు సిద్ధం

**రోలుగుంట:** మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఎంఈవో తెలిపారు. అన్ని పాఠశాలలకు ఒకటి నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు మీడియంకు 32 వేలు ప్రతిపాదించగా, తొలుత 9 వేలు వేలు, తర్వాత 6 వేలు వెరసి 15 వేలు వచ్చాయన్నారు. వాటిని అకౌంటెంటు శ్రీనివాసరావు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చేరవేసి, వాటిని లెక్క చూసుకున్నారు.

# దర్జాగా.. దందా

- సరిహద్దులో నాసిరకం శీతల పానీయాల అమ్మకాలు
- గిరిజనుల ఆరోగ్యంతో వ్యాపారుల చెలగాటం
- ఒడిశా నుంచి సరఫరా అవుతున్న వైనం



ముంచంగిపుట్టులో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న ఐఎస్ఐ మార్కు లేని కూల్ డ్రింక్స్

**ముంచంగిపుట్టు:** ఆంధ్రా– ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఎటువంటి ఐఎస్ మార్కులు లేని నాసిరకం కూల్ డ్రింక్స్ అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. వ్యాపారులకు ఈ డ్రింక్స్ వల్ల అధికంగా లభాలు అర్జిస్తున్న, వీటిని తాగడం వల్ల గిరిజనుల ఆరోగ్యం మాత్రం ప్రమాదంలో పడుతుంది. ఇంతా జరుగుతున్నా అధికారుల అలసత్వం వల్ల నాసిరకం కూల్ డ్రింక్స్ వ్యాపారం మూడు పూవ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ముంచంగిపుట్టు మండలంలోని జోలాపుట్టు కేంద్రంగా కొంతమంది ఒడిశా వ్యాపారులు ఈ కూల్ డ్రింకులు సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా వారపు సంతల్లో, మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో ఈ శీతల పానీయాల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. పెప్సీ, లిమ్కా, మజా తదితర బ్రాండెడ్ శీతల పానీయాల వల్ల అతి తక్కువ లాభం రావడంతో ఎటువంటి ఐఎస్ మార్కు లేని ఒడిశా డ్రింక్స్ వల్ల అధికంగా లాభం వస్తుడడంతో వ్యాపారులు వీటి అమ్మకాలు అధికంగా చేస్తున్నట్టు పలువురు చెబుతున్నారు. దీంతో పాటు ప్రముఖ బ్రాండెడ్ శీతల పానీయాల రంగు, స్టిక్కరింగ్ పోలినట్టే వీటిని తీర్చిదిద్ది ఐఎస్ఐ మార్క్ లేకుండా నాసిరకం పదార్థాలతో తయారు చేసి ఒడిశా వ్యాపారులు అల్లూరి జిల్లాలో పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో వీటి అమ్మకాలు మరింత ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. నాసిరకం శీతల పానీయాలు తాగడం వల్ల అమాయక గిరిజనులు అనారోగ్యం బారిన పడుతున్నారని పలువురు చెబుతున్నారు. యధేచ్ఛగా నాసిరకం అమ్మకాలు జరుగుతున్నా సంబంధిత శాఖాధికారులు కనీసం పట్టించుకోవడం లేదని గిరిజను సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, యంత్రాంగం స్పందించి నాసిరకం శీతల పానీయాలు, వస్తువుల విక్రయాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ నర్సమ్మ మాట్లాడుతూ దాడులు నిర్వహించి, నాసిరకం శీతల పానీయాలు అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## రైతులకు అండగా ప్రభుత్వం



అనంతగిరిలో రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి తదితరులు



డుంబ్రిగుడలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ తదితరులు

**అనంతగిరి:** మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రభుత్వం 90 రాయితీపై సరఫరా చేసిన వరి విత్తనాలను ఎంపీపీ శెట్టి నీలవేణి సోమవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని, రాయితీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందజేస్తోందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో ఉమామహేశ్వరీ మాట్లాడుతూ మండలంలోని అనంతగిరి, జీనబాడు, ఎగువశోభ రైతు భరోసా కేంద్రాల్లో 212 క్వింటాళ్ల వరి విత్తనాలు , గుమ్మకోట రైతు భరోసా కేంద్రంలోని పచ్చిరొట్ట విత్తనాలు 10 క్వింటాలు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. శ్రీకాకుళం సన్నాలు వరి విత్తనాలు 30 కేజీల రూ. 113 అందిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్‌లు రూతు, సింహాద్రి, అప్పారావు, అగ్రికల్చర్ అసిసెంట్ల దీపిక, తదితరులు పాల్గొన్నారు.

**డుంబ్రిగుడ:** మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు 90 రాయితీపై వరి విత్తనాలను ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. ఏవో నీలవేణి మండల వ్యాప్తంగా వరి విత్తనాలు–415 క్వింటాళ్లు, వేరుశనగ–30 క్వింటళ్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. సర్పంచ్ వెంకటరావు, ఉప సర్పంచ్ జగ్గునాయుడు, నాయకుడు బాక సింహాచలం, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటి పథకం పనులకు భూమిపూజ



తాగునీటి పథకం పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

**కూనవరం:** తాగునీటి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జావిజయ అన్నారు. మండల పరిధిలోని పెదార్కూరు పంచాయతీ బండారుగూడెం గ్రామంలో సుమారు రూ.2 లక్షల ఐటీడీఏ నిధులతో నిర్మించనున్న తాగునీటి పథకానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకానికి సంబంధించిన పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సర్పంచ్ మడకం నాగరాణి, ఎంపీటీసీ ధర్ముల అమ్మాజీ, సొసైటీ అధ్యక్షుడు నోముల కొండలరావు,వైఎస్సార్‌సీపీ నాయకుడు బొజ్జా బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ భానుప్రకాష్, కూరా రాఘవయ్య, బాబు బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ వలంటీర్లకు నియామకపత్రాలు



ఎంపికైన గ్రామ వలంటీర్లకు నియామక పత్రాలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

**వై.రామవరం:** మండలంలో ఖాళీగా ఆరు గ్రామ వలంటీరు స్థానాలకు నూతనంగా ఎంపికైన ఆరుగురు అభ్యర్థులకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేసారు. ఎంపీపీ కడబాల ఆనందరావు. ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మీల చేతులమీదుగా నియామక ఉత్తర్వులను అందజేసారు. ఈకార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కరణం కనకరాజు, వైసీపీ నాయకులు పల్లాల తమ్మిరెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సక్రమంగా పనిచేసి, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని సూచించారు.

## క్రీడా శిక్షణ శిబిరాలను వినియోగించుకోండి



ఎస్‌ఆర్‌డీ జిమ్ క్రీడాకారులతో శిలపరశెట్టి బాబీ

**అనకాపల్లిటౌన్:** ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్, నేషనల్ బాడీ బిల్డర్ అవార్డు గ్రహీత శిలపరశెట్టి బాబీ సూచించారు. స్థానిక వేల్పుల వీధిలోని ఎస్‌కేపీ, ఎస్‌ఆర్‌డీ జిమ్‌ల్లో క్రీడాకారులకు సోమవారం ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5 వరకు ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో క్రీడాకారుడికి నిత్యం కోడి గుడ్డు, ఎనర్జీ డ్రింక్, బిస్కెట్ ప్యాకెట్ అందజేస్తున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం సర్టిఫికెట్లు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ది అనకాపల్లి బాడీ బిల్డర్స్ ఫిట్నెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కృష్ణాజీ, కోచ్‌లు, క్రీడాకారులు, జిమ్‌ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు గజ్జాలమ్మ పండగ

**కశింకోట:** మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం గజ్జాలమ్మ పండగ నిర్వహించనున్నట్లు సర్పంచ్ కన్నం శ్యాంసన్, ఉత్సవ నిర్వాహకుడు అద్దెపల్లి శ్రీనివాసరావులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు.అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొవాలని వారు కోరారు.